# చర్విత చర్వణం

గాజులమ్మేవాడు: అమ్మగారూ! యివి మేలురకం గాజులు. అతి చౌక, పుచ్చుకోండి. ఈసరుకు యిప్పుడే వచ్చిందండీ పైనించీ—

శ్రీహరి: ఎక్కడినించి వస్తే మాకేం. మాకు బాగున్నవి, సరసమైన ధరకు యివ్వటమే కావాలి. అంతేగాని యీ సరుకు ఎప్పుడు వచ్చిందీ, ఎట్లా వచ్చిందీ, అన్నీ అనవసరం.

గా : మీకు అవసరమని గాదండీ, గాజులనాణ్యం గురించి చెపుతున్నాను.

శ్రీ. అట్లా యేం చెప్పకు

రాధ మగవాడివి, నీ కెందుకురా గాజులబేరం ?

శ్రీ. అదేమి టక్కయ్యా ?

రా : ఏమిటేమిటి, మగవాడివి కదా, గాజుల్తొడుక్కూర్చుంటావా? నీ కెందుకా బేరాలూ ?

శ్రీ: చిత్రంగావుంది నువు చెప్పేది. గాజులు తొడుక్కు కూర్చుంటేనే బేర మాడాలన్నమాట!

రా : అది కాదురా, ఆడవాళ్ల బేరాలు నీకెందుకూ అని!

శ్రీ: ఆడవాళ్ల బేరమేమిటి గాజులు ? మగవాళ్ళకవసరమయినవెన్ని ఆడవాళ్లు బేరం చేయటం లేదు ?

రా : నీతో వాదించటానికి నాకు తీరుబడి లేదు.

గా : ఎందుకమ్మా పోట్లాడుకొంటారు? యీ గాజుల వయిభవం చూడండి.

రా : గాజులు యిప్పుడు కొనను నేను. ఈమాట నీకు లక్షసార్లు చెప్పాను. అనవసరంగా దింపి, పైగా గోల. ఇంట్లో అందరిపనీ పాడుచేస్తున్నావ్.

గా· నేనా? అంతపాపంచేశానా ? యేదో గాజులు, ఎప్పటిమాదిరిగా కొంటారు గదాఅని నేను రావటమేమిటి, మీరు నామీద వేసిన యీ అభాండమేమిటి? రామరామ!

రా : రామలేదు కృష్ణలేదు. నీతప్పు నీతప్పే. నిజంచెప్పు–నీవు రాగానే మొదట–యిక్కడ సరుకు దింపుకోవద్దని చెప్పానా లేదా ?

గా : చెప్పారనుకోండి, కాని అట్లా చెప్పందెప్పుడు ? చెప్పి తీసుకున్నరోజులున్నాయిగా.

రా : పైగా యిదొకటా? మా మాటలన్నీ అబద్ధాలంటావా ?

గా : మీ మాటలు అబద్ధాలని నేనన్నానా? విషయం చెప్పాను.

రా : విషయం చెప్పావూ? వొచ్చి పావుగంటైందిగదా, నేను కొనననని చెవి తిని ఇంకా యేమిటి ?

గా : ఏముందండీ, కొత్తగా వచ్చిన సరుకని పూర్వమే మనవిచేసుకున్నాను. అంతా ఎగబడికొంటున్నారు. తీరా అయిపోయాక, నాకు యివ్వలేదేమయ్యా, అంటారేమోనని ముందే జాగ్రత్తపడ్డాను.

రా : అబ్బ! అక్కర్లేదని చెపుతున్నానా ? పోనీ, యిప్పుడు చెప్పతున్నాను. వెళ్లు. నాకు వొద్దు అవి.

గా : కొనకపోతే మానె. నామీద దయవుంచి యీ గాజులొకసారి చూడండి.

రా : వొద్దని చివరిసారిగా చెబుతున్నాను. నాకు కోపం తెప్పించకు.

గా : మీకు కోపమా ? పిచ్చుకమీద బ్రహ్మాస్త్రంవెయ్యకండి. కొనద్దంటినిగా. చూడండి.

శ్రీ : ఆవిడ వద్దంటూంటే, నీ కెందుకోయ్ శ్రమ.

గా. మీకు తెలీదు, ఊరుకోండి అబ్బాయిగారూ, అమ్మగారూ, యివి చూడండి.

రా : నువు ముందు లేచి అవతలకి వెళ్లు.

గా : కోప్పడకండి. బేరంకోరి వచ్చాను.

శ్రీ : లాభంలేదయ్యా, మేమేమీ కొనం. వెళ్లు.

గా : మీరు కొనక్కర్లేదండి. ఊరికే చూడమంటినిగా. చూస్తే కళ్లేం కరిగిపోతాయా?

శ్రీ : కళ్లు కరిగిపోతై నిజం. చూడం. వెళ్లు.

గా : ఇంత మొండితనం చేస్తారేమండీ, నే నేమన్నానని ?

రా : నువు చూడబోతే తిన్నయింటి వాసాలు లెక్కబెట్టేమోస్తరుగా వున్నావు. మొండితనంచేస్తున్న దెవరబ్బ ?

గా : తప్పు వప్పుకుంటాను. క్షమించండి. నే నే.

శ్రీ : క్షమించాం. వెళ్ళు

గా. అట్లా వెళ్లేవాడినే అయితే, అసలు రాకేపోదును.

రా : యేమిటయ్యా యింతకీ ?

గా : గాజులు చూడండి, మరేముంది...?

రా : ఛంపేశావు. నీమాటే నీకుగాని, మేంచెప్పేది చెవినిబెట్టవు. గాజులు తీసుకోందీ వదలవు – అంతేగా!

శ్రీ : అదంతా వ్యాపారం టెక్నిక్ మరి! ముందు 'కొనద్దు, ఊర్కే చూడండి' అంటాడు. తీరాచూచాక కొనబుద్ధి అవకండా మానుతుందా ? అంతగా కొనకపోతే, 'ఇంతసేపూ చూచారు, ఊర్కే పంపేస్తున్నారు' అని నిష్టూరాలాడతాడు. అంతా ఆలోచనమీది వ్యవహారం.

గా : మీరేదో పెద్దపెద్ద మాటలు మీలో మీ రనుకుంటున్నారు. అవన్నీ నాకు అర్థం అవుతయిగనకనా? దయచేసి గాజులు చూద్దురూ.

రా : మళ్ళీ మొదలూ...

శ్రీ : ఎన్ని మాటలయినా చెబుతాడు అక్కయ్యా, చివరకొచ్చి 'గాజులుచూడు' అనే! భూమి గుండ్రంగా వున్నదనేందుకిదొక నిదర్శనం.

గా. చూడండి, మళ్ళీ నాకు పొద్దుగుంకిపోతోంది. చీకటిపడకముందే యిల్లు చేరుకోకపోతే, మళ్లా మర్యాదక్కడు.

రా : అదేమిటి ? చీకటి పడితేమాత్రం నీకేం భయం ?

గా : నాకేంభయం—మా యింటిది పోట్లాడుతుందనిగాని—

రా : అదా ?

గా : ఏమయినా, అమ్మాయిగారు, వొచ్చి చూద్దురూ, మీ పుణ్యమాయిరి.

రా : చూచే వోపిక నాకులేదు. నీకే పొద్దుపోతుందని అంత భయంగావుంటే ; నాకేనా అంత వెసులుబాటూ ?

గా : ఈ విధంగా చూడండి ఎంతకాలం వృధా అయిందో. నేను అడిగిన వెంటనే చూట్టానికి వచ్చినట్లయితే, యీ పాటికి అయిపోయేది. ఎవరిదారిన వాళ్ళం వెళ్ళిపోయేవాళ్ళం. మీపనీ వృధా చేసుకున్నారు. నాపనీ అవనిచ్చేరు కాదు.

యిప్పటికైనా మించుకుపోయిందేమీ లేదు. రాండి.

రా: నువు యెన్నయినా కబుర్లు చెప్పు. యింకేమీ పనిలేకపోతే యిక్కడ సత్యాగ్రహం సయితం చెయ్యి. నేనుమాత్రం మొదట అన్నమాటకు భిన్నంగా నడవను, ఎన్నటికీ.

గా: ఆగ్రహం కూడదు అమ్మగారూ, దయచేసి చూడమన్నాను. అంతకన్నా నేనింకేమనగల్ను?

శ్రీ: చూచినట్లు అనుకోని వెళ్ళరాదుటోయ్ నువ్వు?

గా: ఎట్లా అనుకోనండీ, మీరేమో చూడకపోతిరి. చూచారని యెట్లా...

శ్రీ: అనుకోరాదూ, యిందులో మించుకుపోయే ప్రమాదం యేముంది?

రా: ఇన్ని మాటలు ఎందుగ్గాని, వెళ్ళి అమ్మకో లాభం వొస్తుంది.

గా: అదీ. అందుకేగదండి నేను వచ్చింది. మీ నోటిపుణ్యాన నాకు లాభం రావాలి. ఇట్లా అనేక పర్యాయాలు వచ్చింది కూడా: మీరు బోణీబేరం చెయ్యాలి, తరవాత నేను అమ్ముకోవాలి. ఇది నాకు యీ బజారు వచ్చినప్ప[illegible] రివాజయిపోయింది.

రా: నీకు రివాజయితే అయిందేమో గాని; మాకింకా కాలేదు. అయినా ప్రస్తుతం నాదగ్గర రాగి దమ్మిడీ అనదగ్గది లేదు. ఇలాంటి పరిస్థితుల్లో నేను బేరం ఎట్లా చెయ్యగల్ను చెప్పు. ఈ రోజుకు వెళ్ళు.

గా: మీదగ్గిర - దమ్మిడీయేనా లేకపోవటమేమిటండీ-పొద్దునలేస్తే ఎన్ని వందలో బేరాలాడుతూ వుంటారుగదా.

రా: యిది మరీ అన్యాయంగా వుంది. నీకు నా 'బోణీ' మంచి దవటమే ఓ విచిత్రం. తరవాత, అంత మాత్రానికని నేను ప్రతిరోజూ నీదగ్గర గాజులు కొనాలనటం అవివేకం. నిలువునా దోపిడీ చెయ్యటం తప్ప మరేమీ కాదిది.

గా: దోపిడీలు నేనెక్కడ చెయ్యగలనండీ? దొంగలు చేస్తారు, గజదొంగలు చేస్తారు. చేద్దామన్నా నాకు చేతవద్దూ?

శ్రీ: అనవసర ప్రసంగం. వెళ్లు. నాపనీ భంగం అవుతోంది.

గా: బాగుందండీ మీరు చెప్పేది. రెడ్డొచ్చి మొదలాడమన్నాట్ట. ఇంత సొదా



శ్రీహరి "గాజులు తొడుక్కు-కూర్చుంటేనే బేరమా" లన్నమాట!"

విని తిరిగీ అదేమాట! మీ పనికి నేనేం భంగంచేశాను? కనీసం చెయ్యలేను గూడా! నేను అమ్మగారిని చెయ్యమన్న ప్రతి పనీ మీరే చెయ్యటానికి సిద్ధపడుతూ పైగా...చదువుకున్న వాగు యిట్లా అంటే...?

శ్రీ: పోయి—అమ్మకోవయ్యా, పోదీ...

గా: అమ్మగారూ, యీయన్ని నామీదికి వదిలి మీరు వినోదిస్తూ కూర్చున్నారా? ఏం ధర్మమండీ?

రా: తమ్ముడూ నీ పని నువు చేసుకుందూ, అతడేపోతాడు.

శ్రీ: నాదా తప్పు?

రా: నాది! అసలుగాజులు కొనటమే తప్పునాది. వెళ్ళవయ్యా గాజులు కొనన్నేను. యిప్పుడే గాదు యెప్పుడూ కొనను.

శ్రీ: అదేమిటక్కా, గాజులు కొనకండా ఎట్లా గడుస్తుంది! ప్రస్తుతానికి కొనను, అంతే—

గా: ఇప్పుడు మాత్రం ఎందుక్కొనగూడదండీ? సరిగ్గా నెలమీద పదిరోజులయింది మీరు పోయిన తడవ గాజులిచ్చి. నెలకోసారన్నా మమ్మల్ని కనికరించకపోతే ఎలాచెప్పండి.

రా: అయితే ఎవరికోసమయ్యో గాజులు కొనేది, నీకోసమా?

గా: కాదనుకోండి, మీరు పెట్టుకోటానికేగదా కొనాల్సింది. అంతమాత్రం చేత నాకు అందులో యేమీ లాభం లేదని ఎట్లా చెప్పకోను?

రా. ఛీష్.

గా: ఇంతకూ యేం సెలవిప్పించారు? ఈ రకం వక డజను, ఆ రకం ఒక అర డజనూ యిస్తాను తీసుకోండి.

రా: తీసుకోనని మొదట్నించీ చెబుతోనేవుంటిని గదా.

గా. చెబితే మాత్రం యేమండీ, యివ్వనని నేననలేదుగదా.

రా: ఇవ్వనని నువెట్లా అంటావు, గంటనించీ తీసుకోమని పోరుతున్నవాడివి.

గా: తిట్టకండి, అమ్మగారూ, తీస్తున్నాను యేమంటారు?

రా: రెండు నాలుకల్లేవు నాకు.

శ్రీ: ఊరికే యిచ్చేట్లయితే ఎన్నయినా తీసుకుంటాం.

గా: పోనీ అట్లాగే తీసుకోండి, మీదయ. ఇదిగోనండి అమ్మగారు—మొత్తం డజనున్నర.

రా: వద్దయ్యా బాబూ వద్దు. ఇదెక్కడో బలవంతపు బ్రాహ్మణార్థంలాగుందే!

గా: సెలవండీ అమ్మగారూ. రేపొస్తాను బాబూ.

రా: వెళ్తున్నావా యేమిటి? అన్నీ యిక్కడే వొదిలి నీకు డబ్బెక్కడ యివ్వగలం. తమ్ముడూ వెళ్ళాడా యేమిట్రా గాజులతను?

శ్రీ: వెళ్ళాడక్కయ్యా వెళ్ళాడు. రెండురకాల గాజులూ యిక్కడే వొదిలి వెళ్ళాడు.

రా: పిలవరా. వెళ్తుంటే చూస్తూ కూర్చున్నావా?

శ్రీ: పట్టికట్టి ఆపలేంకదా. అబ్బీ! గాజులబ్బీ...లాభంలేదు. పిలుపు అందనంతదూరం వెళ్లిపోయాడు.


రా: అయ్యో రేపొచ్చి డబ్బుకోసం గోలచేస్తాడ్రా.

శ్రీ· డబ్బులేదు, డుబ్బులేదు. ఊరికే యిస్తే తీసుకుంటామంటేగదా యిచ్చాడు.

రా: అంటానికేం. కాని తీరా, చూస్తూండు...రేపు డబ్బు యివ్వమని వెంటపడతాడు.

శ్రీ: డబ్బులిమ్మన్నప్పుడు,వాపసే చేస్తే సరిపోయె!

రా: అంతే చేదాంలే. అవ్విమాత్రం భద్రంగా దాచు. జాగ్రత్తసుమా! ★



అతని ఆనందానికై
ఒక సీసాను
అందుబాటుగా
ఉంచండి:

కడుపులో బాధలేకపోవడం వల్లనే బిడ్డ ఆనందిస్తున్నాడు. బిడ్డ ఆనందమే తల్లికి కూడా ఆనందం.

I.T.L.

# గ్రైప్ సిరప్

ఉత్పత్తిదారులు:
ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబరేటరీ లిడ్.
మల్లేశ్వరం, బెంగుళూరు.
సెల్లింగ్ ఏజెంట్లు:
బెస్ట్ అండ్ కంపెనీ లిమిటెడ్.
పోస్ట్ బాక్సు నం. 63, మద్రాసు.
8237T8